# ఎదురుతిరిగిన సానుభూతి

కథ వ్రాయటానికి కూర్చోగానే యెదురైంది అసలు సమస్య? "దేన్ని గురించి వ్రాయాలి?" అని......ప్రేమ కథలు అందరికీ నచ్చుతాయి. అందరూ చదువుతారు కానీ, ఒక వంక వెర్రిగా చదువుతూనే, ఘాటుగా విమర్శిస్తారు. అందుచేత అలాంటి కథ లాభం లేదు.

ఈ రోజుల్లో అందరూ అభ్యుదయ భావాలూ, ప్రగతి శీలత—అంటూ తెగ ఉపన్యాసాలు దంచుతున్నారు. అంచేత నేనూ ఆ ధోరణిలోనే వ్రాస్తే. ఏదో కాస్త అభ్యుదయ దృక్పథం నాకూ ఉందని డబాయించవచ్చు, అవసరమయినపుడు......ఇంతవరకూ బాగానే వుంది. ఇక — అభ్యుదయ దృక్పథంతో అంటే ఏ ఇతివృత్తం ఎన్నుకోవాలి? సాధారణంగా లేని వాళ్ళ కష్టాలు వర్ణిస్తే అదే అభ్యుదయ దృక్పథంగా లెక్క వేసుకుంటున్నారు అందరూ......కూలి

వాడికి తిండిలేక చచ్చిపోయాడనో ...... రిక్షావాడికి రిక్షా తొక్కలేక గుండెనొప్పి వచ్చిందనో, (ఈ మధ్య ఈ వార్త పేపర్లో కూడా వచ్చింది. అభ్యుదయ దృక్పథం మాత్రమే కాదు...... వాస్తవికత కూడా వుంటుంది. ఇంతకూ సాహిత్యంలో వాస్తవికత అంటే వున్నది ఉన్నట్లుగా వ్రాయటమా? ఈ సంగతి తేల్చవలసింది విమర్శకులు) వ్రాస్తే చచ్చినట్లు అభ్యుదయ దృక్పథమై వూరుకుంటుంది. అప్పుడిక అందులో బాగుండక పోవటానికి ఏమీ వుండదు కాని, ఎవ్వరూ చదవరు...... నాకు పాప్యులారిటీ రావటం కష్టమే! ఆ! బ్రహ్మాండమయిన ఆలోచన! ఒక పతిత జీవితాన్ని వర్ణించి సానుభూతి కురిపిస్తే సరి! అప్పుడది అభ్యుదయ సాహిత్యంలోకి వస్తుంది. పాఠకులూ చదువుతారు. తెలుగు సినిమాల్లో విమర్శించటానికన్నట్లుగా క్లబ్ డాన్సులుపెట్టి డబ్బు చేసుకున్నట్లు. సానుభూతి చూపిస్తున్నట్లుగా వ్యభిచార జీవితాన్ని వర్ణించి పాఠకులను ఆకట్టుకోవచ్చు.

ఈ ఆలోచన వచ్చిందే తడవుగా ఒక పతిత నీచ జీవితాన్ని అతి రమ్యంగా చిత్రించి అపారమయిన సానుభూతి కుమ్మరించి—'హమ్మయ్య' అనుకున్నాను. నా 'హమ్మయ్య' ఇంకా నా గొంతులో ఉండగానే నా కథలోంచి చివాలున లేచి నా ఎదురుగా నిలబడి "చదువూ సంస్కారం ఉన్న దానివి. పైగా రచయిత్రివి. ఇదేం పోయేం కాలం నీకు?" అని అడిగింది నిప్పులు కక్కుతూ నా పతిత కేరక్టర్. నేను

హడిలిపోయి "ఏం చేశాను నేను! నీ పైన ఎంతో సానుభూతి......" అంటూ నచ్చజెప్ప బోతుండగానే నామీద విరుచుకు పడింది నా పతిత కేరక్టర్.

"నువ్వూ నీ సానుభూతీ! నువ్వు ఎటు తల తిప్పినా నా కంటె దయనీయులు లక్షోప లక్షలుండగా నీ సానుభూతి ఒలక పొయ్యడానికి నేనే దొరికానా? అదిగో అటు కుడి వైపుకి చూడు! కనపడుతోందా. సుందరమ్మ!"

ఆఁ! సుందరమ్మ కనపడకేం! ఆవిడ సుందరిగా ఉండే రోజుల నుండీ నాకు బాగా తెలుసు. చూస్తూ ఉండగా సుందరి సుందరమ్మగా మారి పోవటమూ తెలుసు. సుందరమ్మను ఎప్పుడు ఎవరు కదిలించినా చాలా సగర్వంగా చెప్పుకొంటుంది "నేను ఏనాడూ వంచిన తల ఎత్తి మొగవాళ్ళ కేసి చూడను. అల్లరిచిల్లర వేషాలు వెయ్యను." అని......

ఆ మాటల్లో ఆవగింజంతయినా అబద్ధంలేదు. ఇద్దరన్నదమ్ములూ, ఇద్దరక్క చెల్లెళ్ళూ ఉన్న మధ్యతరగతి కుటుంబీకుడు సుందరి తండ్రి. పెద్ద కూతురి పెళ్ళి చేసి అప్పులపాలయి పోయాడు. కొడుకులిద్దరూ చదువుకుని ఉద్యోగస్థులయినా, తనను ఏ విధంగానూ ఆదుకోక పోయేసరికి, సంసారం కంటె సన్యాసం మేలనే వేదాంత సారాన్ని గ్రహించి తండ్రి సన్యాసుల్లో కలిసిపోయాడు. అన్నదమ్ములిద్దరూ స్త్రీ పురుషులకు సమాన హక్కులనే విశాల

భావాన్ని చక్కగా వంట పట్టించుకుని మహోదారంగా తమ సహోదరికి వివాహవిషయంలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చేసి తమ తమ వివాహాలు చేసుకుని సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు. ఇక తల్లికి అహర్నిశలూ కూతురి పెళ్ళి గురించే బెంగ. అంచేత బాగా చదువుకున్న వాడూ, మంచి ఉద్యోగస్థుడూ, చాలా చక్కని వాడూ అయితే తప్ప తన కూతుర్నియ్యనని పట్టు బట్టింది. ఆవిడలోనూ విశాల భావా లకు తక్కువలేదు. అంచేత కట్నమిచ్చి కూతురికి పెళ్ళి చెయ్యకూడదని నిశ్చయించుకుంది...... కట్నం కోసం డబ్బు పోగు చెయ్యవలసిన అవసరం లేదు గనుక సుందరి జీతం ఏ నెల కానెల ఇంటి ఖర్చుల క్రిందే ఖర్చయిపోయేది. ఇన్ని విశాల భావాల మధ్య మహోదరాశయాల మధ్య సునా యాసంగా సుందరమ్మగా మారిపోయిన సుందరికి మిగిలిన దొకటే సంతృప్తి. "నేను చాలా మంచిదాన్ని......ఇంతమంది మొగవాళ్ళ మధ్య తిరుగుతోన్నా ఒక్కళ్ళనయినా ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు." అని సగర్వంగా అడిగిన వాళ్ళకూ, అడగని వాళ్ళకూ చెప్పుకోవటం......"ఏం? ఆ తప్పనిసరి సౌశీల్యాన్ని చూస్తోంటే — తన్నుకు రావటం లేదూ, నీకు సానుభూతి?" ఈసడింపుగా అడిగింది నా పతిత కేరక్టర్.

సమాధానం చెప్పలేక గుటకలు మింగాను. "అదిగో, అలా ఎడమవైపుకి చూడు! కనిపిస్తోందా. వరాలు పిన్ని?"

బాగుంది! వరాలు పిన్ని నా కెందుకు తెలియదూ? ఆ మాటకొస్తే వరాలు పిన్నిని తెలియని వాళ్ళెవరు? ఆవిడ అసలు పేరు వరలక్ష్మమ్మ. కాబోలు! కానీ, అందరూ 'వరాలు పిన్ని' అనే పిలుస్తారు. వరాలు పిన్ని బ్రహ్మాండంగా వంటలు చెయ్యగలదు. ఆవిడ బూడిద గుమ్మడికాయ వడియాలు పెట్టినా, ఎండావకాయ, తొక్కుడు మాగాయ, అల్లం అవకాయ, ఇలా రకరకాల ఊరగాయలు పెట్టినా, కందిగుండ విసిరినా, పులిహోర కలిపినా అన్నీ అమృత తుల్యంగా తయారవుతాయి. ఈ పనుల కాశపడే అందరూ— "పిన్నీ! పిన్నీ!" అంటూ ఆవిడ చుట్టూ తిరుగుతారు. ఆవిడకు ముగ్గురు కొడుకులున్నారు. ఇద్దరు కూతుళ్ళున్నారు. అందరికీ తల్లి అంటే ప్రాణమే! తల్లికేం చెయ్యాలన్నా అందరూ సిద్ధమే! అయితే ఇక్కడో చిన్న చిక్కొచ్చి పడింది. కొడుకులు తల్లికి ఏదైనా చెయ్యాలనుకొంటే కోడళ్ళకు పడేది కాదు......కూతుళ్ళు ఏదైనా చెయ్యాలనుకొంటే అల్లుళ్ళు మండి పడేవాళ్ళు. తన ఎదురుగానే, కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ తనకు పిడికెడు మెతుకులు పెట్టడానికి, తన కనీసావసరాలు చూడటానికీ హోరా హోరీ పోట్లాడుకుంటూ వుంటే, ఆ ముసలి ప్రాణం విలవిలలాడి పోయేది. ఆత్మాభిమానంతో ఆ మనసు కుతకుత ఉడికిపోయేది. "నా. రెక్కలు నాకున్నాయి. మీరు నాకేం పెట్టక్కర్లేదు. ఏ యింట్లో వంట చేసుకున్నా, నా బ్రతుకు గడిచి పోతుంది."

అని ఆవిడ అంటే, "హవ్వ! మా అమ్మ వంట మనిషా? మా పరువుప్రతిష్టలేం కావాలి!" అని కొడుకులూ, కూతుళ్ళూ బుగ్గలు నొక్కుకుని గుండెలు బాదుకునేవాళ్ళు. పాపం! ఆవిడ మరో మార్గం లేక ఇరుగింటికీ పొరుగింటికీ, పెత్తనాని కన్నట్లుగా వెళ్ళి ఆపనీ, ఈ పనీ చేసి, ఏదో చేతి ఖర్చులకు కాస్త సంపాదించుకొనేది. ఈ కార్యక్రమంలో ఆవిడ మానవ మనస్తత్వంలో ఒక మూల సూత్రం కనిపెట్టేసింది. ఎవరయినా తనుకు మనస్పర్థలున్న వారిని తిడితే పొంగి పోతారని......తమకు మనస్పర్థలున్న వారిమీద నేరాలు చెప్పడానికీ, వినడానికీ కూడా మహా ఉత్సాహపడి పోతుంటా రనీ......

ఈ రహస్యం తెలుసుకున్నాక, ఆవిడ ఏ ఇద్దరి మధ్య పొర పొచ్చాలున్నాయో తెలుసుకునేది. ఆ యిద్దరికీ ఆప్త మిత్రురాలిలా నటించేది. అక్కడ విన్నవి ఇక్కడ, ఇక్కడ విన్నవి అక్కడా వన్నె చిన్నెలతో, వినూత్న అంద చందా లతో అందిస్తూ ఇద్దరి దగ్గరనుంచీ తనకు కావలసినవి రాబట్టు కొనేది. ఏ పరిస్థితుల్లోనూ ఆ యిద్దరూ మనస్పర్థలు తొలిగి ఒకటి కాకుండా జాగ్రత్త పడేది ...... ఐతే ఎల్లకాలం రోజులు ఒక్కలా సాగవు కదా! రంగమ్మగారూ, సుబ్బమ్మ గారూ, ఎన్నాళ్ళ బట్టో ప్రాణానికి ప్రాణంగా కలిసి-మెలసి స్నేహంగా వుండేవారు. ఏదో సందర్భంలో ఇద్దరకీ కొద్దిగా మాటా మాటా వచ్చింది. వరాలు పిన్నికీ విషయం తెలి

సిందే తడవుగా కార్యరంగంలోకి దుమికి తన కార్యక్రమం ప్రారంభించింది. చూస్తూ ఉండగా ఇద్దరి మధ్యా విద్వేషాగ్ని చెలరేగి ఒకరి ముఖం చూడగానే మరొకరు మండి పడే దశకి చేరుకున్నారు. అయితే సుబ్బమ్మగారికి రంగమ్మగారి మీద నిజంగా అభిమానం ఉంది. అలాగే రంగమ్మగారికీ సుబ్బమ్మగారి మీద వల్లమాలిన ఆదరముంది. అంచేత యిద్దరూ ఒకరి నొకరు వరాలు పిన్ని మధ్యవర్తిగా ఎంత ఆడిపోసుకుంటున్నా, ఎలా అయినా ఈ మనస్పర్థలు పోతే బాగుండుననే కోరుకుంటున్నారు. ఒక శుభ ముహూర్తాన సుబ్బమ్మగారు తెగించి రంగమ్మగారి నడిగేసింది.

"వదినా! అన్నాళ్ళు తల్లీ తోడుగా ఉన్నాం కదా! ఈ నాటికి ఏదో చిన్న మాటా మాటా వచ్చిందని నన్నింత ఆడి పోసుకోవటం తగునా?" అని సుబ్బమ్మగారు అంత స్నేహంగా అడిగేసరికి రంగమ్మగారు కరిగిపోయి "అదేం మాట వదినా! నేను నిన్నెందు కంటాను? నువ్వే నన్ను అన్నావని వరాలు పిన్ని చెపితే వాళ్ళు మండి నేనూ రెండ న్నాను." అనేసింది. ఇద్దరూ కలిసిపోయి "నువ్వేం అన్నావ్?" అంటే, "నువ్వేం అన్నావ్?" అని అన్ని విషయాలూ తేల్చుకునేసరికి వరాలు పిన్ని కల్పనా చాతుర్యం ఇద్దరికీ అర్థమై ఇద్దరూ ఒక్కసారిగా గుండె బాదుకుని, ఇద్దరూ చెట్టా పట్టా లేసుకుని వరాలు పిన్ని ఇంటికి వెళ్ళి చెడా మడా దులిపేసి గట్టిగా బుద్ధిచెప్పి ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు.

వరాలు పిన్ని వంట అమృతమే కాని, వాక్కు విషం అని వీధి కంతకూ తేలిసిపోయింది. అక్కడితో అందరికందరూ ఆవిడని తమ గడప తొక్కనియ్యకుండా జాగ్రత్తపడ్డారు. పాపం వరాలు పిన్ని కొడుకులు లేకుండా కోడళ్ళూ, కూతుళ్లు వుండగానే అల్లుళ్ళూ అంటున్న పొద్దుమాటలన్నీ చచ్చినట్టు పడుతూ మంచంలో పడి మూలుగుతోంది.

"పరిస్థితులు సృష్టించిన ఆ సైకో సృజనాత్మక ప్రతిభను చూస్తోంటే కలగటం లేదూ, మీకు తట్టెడు సానుభూతి?......" నిరసనగా అడిగింది నా పతిత కేరక్టర్.

ఏం చెప్పను? వరాలు పిన్ని తాకిడి నేనూ అనుభవించాను. ఎవరికీ చెప్పొద్దని వరాలు పిన్ని కామేశ్వరిమీద నాకు చెప్పిన నేరాలు నేను ఎవరికీ చెప్పొద్దని రాజేశ్వరికి చెపితే, రాజేశ్వరి ఎవరికీ చెప్పొద్దని లలితకి చెపితే, లలిత దగ్గిరా అనొద్దని ఒట్టేయించుకుని కామేశ్వరికి చెప్పేస్తే, కామేశ్వరికీ నాకూ పెద్ద పోట్లాటయింది. ఆనాటినుంచే అప్పడాలూ, వడియాలూ లేకపోతే పీడాపోయిందని వరాలు పిన్నికి ఆమడ దూరాన వుంటున్నాను. "అటూ–ఇటూ చూడటం ఎందుకులే!...... అసలు నాకు నిన్ను చూస్తేనే బోలెడు సానుభూతి!" అల్లరిగా నవ్వుతూ అంది నా పతిత కేరక్టర్, అదిరిపడ్డాను. నేను ఎంతో సానుభూతి కలిగేలా సృష్టించిన నా కేరక్టర్‌కి నామీద సా ను భూ తా?......

పొడారిపోతున్న గొంతుకతో "ఎందుకూ?" అన్నాను భయంగా. పేరుప్రఖ్యాతులొస్తాయని ఆశపడి బీదవాళ్ళ కథలు వ్రాయటానికి తయారవుతున్నా! అసలు నీకు బీదవాళ్ల జీవితం గురించి ఏం తేలుసునని? ఏ. సి. రూంలో కూచొని, పగలంతా చెమటోడ్చిన కూలివాడికి కుండలో అన్నం లేదని వ్రాసేస్తే అది బీదవాళ్ళ కథ అయిపోతుందను కున్నావా? మారుతున్న కాలంలో పరిస్థితులతో పాటు మారే మనస్తత్వాలెలా వుంటున్నాయో, ఆ సంఘర్షణల ఫలితంగా జీవితం ఎలా వుంటుందో ఎప్పుడయినా గమ నించావా నువ్వు?

"ఈ రోజుల్లో హరిజనులకు స్కాలర్‌షిప్పు లిస్తు న్నారు. వాటి కోసం ఆశపడి అయినా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలిని బళ్ళోకి పంపిస్తున్నారు. అలా ఒక కళావతి కాలేజీదాకా వచ్చింది. పాపం కాలేజీలో చదువుతోన్నా ఆ కళావతికి ఇంటి పరిస్థితుల్ని బట్టి పాచిపని చెయ్యక తప్పటంలేదు. కాలేజీలో చదువుతూ మరొకరి ఇంట్లో పని మనిషిగా బ్రతకవలసి వచ్చిన ఆ కాలేజి కళావతి క్షోభ ఎలా వుంటుంది? కాలేజి చదువు కారణంగా పిల్లలతో పరిచయాలూ, స్నేహాలూ ఏర్పడి వాళ్ళ జీవితాలతో తన జీవితం పోల్చుకున్నప్పుడు ఆ అమ్మాయి మనసులో ఎలాంటి సుడిగుండాలు చెలరేగుతాయి?...... చదువుకున్నంత మాత్రాన తననే పెద్దింటి యువకుడూ పెళ్ళిచేసుకోక పోగా

చదువుకున్న కారణంగా చదువుకోని మావయ్యని పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడలేని ఆ అమ్మాయి జీవితనౌక ఏ మార్గాలలో పయనిస్తుందీ? ఈ సమస్యలు ఎప్పుడయినా ఆలోచించావా నువ్వు."

సమాధానం చెప్పలేకపోయాను. బీదవాళ్ళు అనగానే నా మనసులోకి వచ్చే ఆలోచన—తిండీ బట్టా లేని వాళ్ళు మాత్రమే! అంతకు మించి నాకు తెలియటానికి వాళ్ళ బ్రతుకుల్లో లోతుపాతులు ఏనాడయినా పరిశీలించానా?...... అయినా నన్ను నేను సమర్థించుకోవాలని "వాళ్ళలో ఆ మాత్రం చదువుకున్న వాళ్ళు ఎంతమంది వున్నారు? ఇప్పటికి వాళ్ళలో చదువుమీద ఆసక్తి ఏ మాత్రం వుందీ?—" అన్నాను.

"మంచి పాయింటే తెచ్చావు, పోనీ, చదువుమీద ఆసక్తి వున్నా చదువుకోవటానికి అవకాశాలు లేక నలిగిపోతున్న కూలికుర్రాడి గురించి రాశావా? ఒక యింట్లో అందరూ అభ్యుదయ వాదులే! ఆ ఇంట్లోనే ఫుల్ టైం సర్వెంట్ రాము. తెల్లవారి లేచింది మొదలు ఆ యింట్లో ప్రతి ఒక్కరూ "నువ్వు చదువుకోవాలి రామూ! చదువుకోక పోతే ఎలా పైకొస్తావు?" అనటం మానరు. ఈ ఉపదేశాలు విని వాడికీ చదువుకోవాలని ఆశ కలిగి—పిల్లల్ని చదువు చెప్పమని ప్రాథేయ పడితే, ఎవరి మటుకు వాళ్ళే

"ఇప్పుడు నాకు టైం లేదు రామూ! చదువు సంగతి తర్వాత చూద్దాం కాని, ముందు నాషర్టు ఇస్త్రీ చెయ్యి, సినిమాకి పోవాలి" అంటారు. యజమాని నడిగితే "ఇప్పుడు నీకు చదువు చెప్పుతూ కూచోవటానికి ఎలా కుదురుతుందిరా! సాయంత్రం పార్టీ ఉంది, సోడాలూ అవీ రెడీ చేసి చిప్స్ వేయించి సిద్ధంగా ఉంచు" అంటాడు. యజమానురాలి నడిగితే "తర్వాత చెపుతానులేరా! నువ్వు తప్పకుండా చదువుకోవలసిందే!...... అన్నట్లు మార్కెట్ కెళ్ళి మంచి చింతకాయలు చూసి ఒక మణుగు పట్టుకురా!......చింతకాయ పచ్చడి పెట్టుకుందాం!" అంటుంది. ఈ రంగులరాట్నంలో ఎదిగీ ఎదగని ఆ పసివాడు ఎక్కడ తేల్తాడో ఎప్పుడైనా వూహించావా?"

మాట్లాడలేక పోయాను.

"ఇక అటు తిరిగి. ఇటు తిరిగి నామీద సానుభూతి కుమ్మరిస్తావా? సా......ను......భూ......తి! నా జీవితం గురించీ, నా మనస్తత్వం గురించీ, నేను బ్రతుకుతోన్న వాతావరణం గురించీ, నేను ఎదుర్కోవలసి వచ్చే సంఘర్షణల గురించీ ఏ మాత్రం అర్థం చేసుకోగలిగావని నామీద కథ వ్రాయటానికి సాహసించావ్? అనుభూతీ, ఆరాటమూ, ఉద్రేకమూ, ఉద్వేగమూ, ఏవీ లేకుండా బోల్డు స్లోగన్లు. ఏకరువు పెడితే- అవి వ్యాసాలవుతాయి, ఉపన్యాసా లవుతాయి. మరే

విన్యాసాలయినా అవుతాయి. కాని రసవత్తర సన్నివేశ కల్పన, రమణీయ కథా కథనమూ ఊపిరిగా నిలిచే కళాత్మక సాహితీ సృష్టి అవుతుందా? ఇప్పుడే చెపుతున్నాను. నిష్కారణంగా నా మీద సానుభూతి కుమ్మరించావంటే జాగ్రత్త! నీ బోటి పరమహంసల కంటె నాబోటి పతితలు లక్ష రెట్లు, కోటి రెట్లు—కాదు—శత కోటి రెట్లు మెరుగు!"

నా కథ కాగితాల్లోంచి చరచర నడిచి పోయింది నా పతిత కేరక్టర్.